సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 22 । జూలై । 2024



విద్యా వారోత్సవాలకు..

నేటి నుంచి జిల్లాలో శిక్షా సప్తాహ్ నిర్వహించనున్నారు. వారం పాటు కార్యక్రమాలు జరుగుతాయి.

-8లో



వేర్వేరు రైలు ప్రమాదాల్లో..

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ముగ్గురూ గుర్తు తెలియని వ్యక్తులే.

-8లో

డిగ్రీ ప్రవేశాల దరఖాస్తు స్వీకరణ గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ గడువును ఉన్నత విద్యా మండలి పెంచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 87 ప్రైవేట్, 15 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. షెడ్యూల్‌లో చేసిన మార్పుల మేరకు ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వెబ్ ఆప్షన్ల నమోదు 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సీట్ల అలాట్‌మెంట్‌లు ఆగస్టు 3న ప్రకటిస్తారు. 5వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభం కానుంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటీఐ)లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో మిగులు సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అర్హులైన 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఐటీఐ.ఏపీ. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐలు ఉండగా, విద్యార్థులు ఎంచుకున్న ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలతో సమీప ప్రభుత్వ కళాశాలల్లో 25వ తేదీలోపు ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలి. వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. 26వ తేదీన కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించి, సీట్లు కేటాయించారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 23 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3608 సీట్లు ఉండగా, 826 ప్రవేశాలు జరిగాయి. 2782 మిగులు సీట్లు ఉన్నాయి.

ప్రశాంతంగా ఎర్రన్న విద్యాసంకల్పం పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిభావంతులైన నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో వరుసగా రెండో ఏడాది నిర్వహించిన ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, మెటీరియల్స్‌ను తన తండ్రి ఎర్రన్నాయుడు జ్ఞాపకార్థం అందజేయాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వరుసగా రెండో ఏడాది ఆదివారం జిల్లాలో శ్రీకాకుళంలోని విద్యాధరి డిగ్రీ కళాశాల, పలాసలోని మదర్ థెరిస్సా పాఠశాల, టెక్కలి విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల ఈ మూడు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 650 మంది హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఏడుగురు ఎంపిక




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

జలుమూరు: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జలుమూరు కేజీబీవీకి చెందిన ఏడుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారి అరుగుల యశోద ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలకు మొత్తం 14 మంది వెళ్లగా రాష్ట్రస్థాయికి ఎస్.మంజు, ఎన్.హేమలత, డి.జ్యోతి, జే.దీక్షిత, ఎస్.హేమలత, జ్ఞానేశ్వరి, ఎస్.శ్రీవల్లి ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఆగస్టు 3,4 తేదీల్లో అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థినులను పీఈటీ నీరజ, ఉపాధ్యాయులు వాన సుజాత సిబ్బంది అభినందించారు.

'అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు కోరారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 2020-2021లో ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్రం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు ఒకే సారి రుణవిముక్తి కలిగించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ప్రతి నెలా పింఛన్ రూ.10వేలు ఇవ్వాలని కోరారు. రైతులపై పెట్టిన కేసులన్నీ కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

C/O కలెక్టరేట్



- కొందరు ఉద్యోగులకు శాశ్వత చిరునామాగా కలెక్టరేట్
- 'కలెక్టరేట్ కోటరీ'గా మారి నియంతృత్వం
- కొత్త కలెక్టర్ పర్యవేక్షణలోనైనా సిబ్బంది మారేనా..?



శ్రీకాకుళం పాతబస్టాండ్:

జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి.. సూపరింటెండెంట్ క్యాడర్‌కు చేరే ప్రయాణంలో ఉద్యోగి ఎన్నో కొత్త ప్రాంతాలు చూస్తాడు. ఎక్కడెక్కడో విధులు నిర్వహిస్తాడు. బదిలీలంటూ కొత్త కొత్త ఊళ్లు తిరుగుతుంటాడు. కానీ మన కలెక్టరేట్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతోంది. ఇక్కడ కొందరు ఉద్యోగులు ఏళ్లకు ఏళ్లుగా ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చున్నారు. కొందరు సూపరింటెండెంట్లు, డీసీ స్థాయి ఉద్యోగులు కలెక్టరేట్‌ను విడిచి ఇతర ప్రాంతాల్లో ఎక్కడా పది రోజులు కూడా పనిచేయలేదంటే నమ్మి తీరాల్సిందే. పేరు పక్కన కేరాఫ్ కలెక్టరేట్ చిరునామా శాశ్వతంగా ఉండిపోయేలా ఇక్కడి సీట్లకు అతుక్కుని ఉన్నారు. ప్రభుత్వాలు మారినా, ఎంత మంది కొత్త ఉన్నతాధికారులు వచ్చినా వారందరినీ మాయ చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. మండలాల నుంచి కలెక్టరేట్‌కు ఉద్యోగులు రావడం లేదని చెబుతూ వీరు కాంపౌండ్ దాటి బయటకు వెళ్లడం లేదు. ఈ కోటరీ మాటే ఇప్పుడు కలెక్టరేట్‌లో శాసనంగా మారడం విశేషం.

వారు చెప్పిందే వేదం..

రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతుల్లో, సీనియారిటీ జాబితాల తయారీ, కారుణ్య నియమకాలు, ఇంక్రిమెంటు మంజూరు.. ఇలా అన్ని పనుల్లోనూ కలెక్టరేట్ కోటరీ మాట దాటి పని జరగడం లేదు. ఇటీవల ఎన్నికల ముందు డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతులు వచ్చాయి. జోన్-1లో అన్ని అర్హతలు, సీనియారిటీ ఉన్నా జిల్లాలో ఇద్దరు డీటీలు జీఎల్ శ్రీనివాస్, బలగ గోపాల్‌లకు ఈ పదోన్నతి దక్కలేదు. వీరితో పాటు సమాన సర్వీసులు ఉన్న జోన్-1లో ఇతర జిల్లాల వారికి పదోన్నతులు వచ్చాయి. వీరు మాత్రం నష్టపోయారు. వారి సీనియారిటీ జాబితాను ప్రభుత్వానికి సంబంధిత అధికారులు అందజేయలేదు. పదేళ్లు ఒక జూనియర్ అసిస్టెంట్‌కి ఫైల్‌ను క్లియర్ చేయకుండా తొక్కిపెట్టారు. ఆయనతో పాటు ఉద్యోగం చేసిన వారంతా డీటీలుగా ఉంటే ఆ ఉద్యోగి మాత్రం ఇంకా జూనియర్ అసిస్టెంట్‌గానే ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

కారుణ్య నియామకాల విషయానికి వస్తే.. వీరు కరుణించాల్సిందే అన్న వాదనలు ఉన్నాయి. కారుణ్య నియామకాల కోసం సుమారుగా 38 మంది వేచి ఉన్నారు. మరికొంత మందికి సర్వీసు సమస్యలు పరిష్కారం కాక, క్రమశిక్షణ చర్యల్లో ఉన్న ఉద్యోగులకు వారి ఫైల్స్ క్లియర్ కాకుండా ఏళ్లకు ఏళ్లు గడిచిపోతున్నాయి. ఈ కోటరీనే కలెక్టరేట్‌ను శాసించడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం కూడా మానేశారు. ఈ ఉద్యోగుల వైఖరి వల్ల రెవెన్యూలో కింది స్థాయి ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు.

కొత్త వారు వస్తారా..?

ప్రస్తుతం వీరిలో తహసీల్దారు కేడరు ఉన్నవారంతా ఎన్నికల నేపథ్యంలో పక్క జిల్లాలకు బదిలీపై వెళ్లి వస్తున్నారు. వీరికి జిల్లాలో తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఈ సారైనా ఈ కోటరీ అధికారులు, ఉద్యోగులను కలెక్టరేట్ నుంచి బయటకు పంపిస్తారేమో చూడాలని అక్కడి వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో పనిచేయని వారికి అవకాశం కల్పిస్తే పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ ఉద్యోగులు భావిస్తున్నారు. మరోవైపు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ వారు కూడా పాతవారిని వద్దనే చెబుతున్నారు. ఇప్పటికే చాలా మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, ఇక నుంచైనా రెవెన్యూ ఉద్యోగులకు మేలు చేయాలంటే కలెక్టరేట్‌లో దీర్ఘకాలంగా ఉన్న సెక్షన్ అధికారులను, డీటీలను బదిలీలు చేయాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని గతంలో పలు సార్లు జాయింట్ కలెక్టర్, అప్పటి కలెక్టర్లకు విన్నవించామని చెబుతున్నారు.

కలెక్టరేట్ కోటరీ వీరే..

కలెక్టరేట్‌లో రెండు రకాల కోటరీలు ఉన్నాయి. వీరిలో సూపరింటెండెంట్ (తహసీల్దారు) కేడర్ వారు ఒక కోటరీ అయితే.. డిప్యూటీ తహసీల్దారు, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగులు మరో కోటరీగా ఉన్నారు. తహసీల్దార్ క్యాడర్‌లో గతంలో (ఎన్నికల ముందు ఉన్నవారు) పరిపాలనాధికారి రాజేశ్వరరావు, బి సెక్షన్ సూపరింటెండెంట్ సురేష్, కలెక్టర్ సీసీ సూర్యనారాయణ (డి సెక్షన్ సూపరింటెండెంట్), గతంలో జేసీ సీసీ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సి సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశ్, ఇ సెక్షన్ సూపరింటెండెంట్ రామమూర్తి ఉన్నారు. డీటీ క్యాడర్‌కు సంబంధించి సి సెక్షన్‌లో డీటీ ఎస్.చక్రవర్తి, డి సెక్షన్‌లో సోనీకిరణ్, రాజారెడ్డి, స్పందన, ఎ సెక్షన్‌లో ఢిల్లీ, పి.కృష్ణకాంత్, హెచ్ సెక్షన్‌లో క్రాంతి ఉన్నారు.

నీ చరణం.. మా శరణం కానీవ



శ్రీకాకుళం మొండేటివీధిలోని బాబాకు పూజలు





శ్రీకాకుళంలోని బొందిలీపురం సాయి దర్బార్‌లో వేషధారణలో కళాకారులు (ఇన్‌సెట్లో) నరసన్నపేట: కలివరపుపేటలో భక్తులు, కమిటీ సభ్యులు వితరణగా అందించిన పది తులాల బంగారు కిరీటం

గురు పౌర్ణమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా షిర్డీ సాయి ఆలయాలు కళకళలాడాయి. సాయిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల సాయి వేషధారణలు కూడా ఆకట్టుకున్నాయి. – శ్రీకాకుళం కల్చరల్

జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయం

శ్రీకాకుళం: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ పద్ధతులతో ప్రచారం చేస్తూ విద్యార్థుల్లోను, ప్రజల్లో చైతన్యం తీసుకురావటంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కె.వెంకటేశ్వరరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల కుమార స్వామి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలపై ఈ సంస్థ ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. శాస్త్రీయ దృక్పథంతో జిల్లాలోని మేధావులు, విద్యావేత్తలు సైన్స్ ఉద్యమంలో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, నాయకులు జి.మోషే, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న డీఈఓ వెంకటేశ్వరరావు

'జీవశాస్త్రాన్ని సమగ్రంగా బోధించాలి'

సోంపేట: జీవశాస్త్రాన్ని సమగ్రంగా విద్యార్థులకు బోధించాలని జీవశాస్త్రం ఉపాధ్యాయ ఫోరం జిల్లా ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయ ఫోరం జీవశాస్త్ర ప్రాంతీయ సమావేశాన్ని సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు బోధిస్తున్న జీవశాస్త్ర పాఠ్యాంశాలను పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా అదనపు సమాచారంతో విపులంగా బోధించాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే పాఠ్యాంశాలను పుస్తకాల్లో తొలగించారని, తిరిగి వాటిని పొందుపర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయ్‌కుమార్, రాష్ట్రనాయకులు ప్రమోద్‌కుమార్ పాడి, గొంటి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షులు గగనకుమారి, ఒడియా పాఠశాలల ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, మందస మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు

సురవరంలో భారీ చోరీ



ఇంటిలో బీరువా పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

జలుమూరు: సురవరం గ్రామంలో శివ ప్రసాద్ అనే వ్యక్తి ఇంటిలో భారీ చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శివప్రసాద్ వ్యాపార రీత్యా శ్రీకాకుళంలో ఉంటారు. ఆయన తల్లి ప్రభావతి హైదరాబాద్‌లో ఉండి ఆదివారం సురవరంలోని ఇంటికి వచ్చారు. ఆమె తరచూ హైదరాబాద్ వెళ్లి వస్తుంటారు. ఆదివారం ఇలాగే వచ్చారు. అయితే ఇంటిలోకి వచ్చి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా ఇంటి వెనక తలుపు తెరిచి ఉండడం, ఇంటిలో బీరువా సేఫ్ లాకర్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందజేశారు. వీరు వచ్చి ఇంటిని పరిశీలించారు. ఈ చోరీలో రూ.9 లక్షల నగదు పోయినట్లు బాధితురాలు చెబుతున్నారు. అలాగే వెండి వస్తువులు కూడా చోరీ చేశారని ఆమె పోలీసులకు తెలిపారు. టెక్కలి డీఎస్పీ బాల చంద్రారెడ్డి, సీఐ బూర ప్రసాద్, శ్రీకాకుళం క్లూస్ టీమ్ ఇంటితో పాటు పరిసరాలు, బీరువా పరిశీలించారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

ఇటీవల సైరిగాం పంచాయతీ పరిధి లింగంన్నాయుడుపేటలో కూడా ఈ మాదిరిగానే బీరువా ఎత్తుకెళ్లారు. అది మరవక ముందే ఇలా సమీప గ్రామంలో ఇలా మళ్లీ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శివ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

తంపర పొలాల్లో తరగని వరద

ఎల్.ఎన్.పేట: గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తంపర పంటపొలాల్లో వరద నీరు తగ్గడం లేదు. మండలంలోని దబ్బపాడు, తురకపేట గ్రామాల మధ్య పొలాలు సముద్రాన్ని తలపించేలా దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాలతో పాటు కోవిలాం, రావిచంద్రి, చింతలబడవంజ, ధనుకువాడ, చిట్టిమండలం, వాడవలస, బరటాం, సుమంతాపురం, సిద్ధాంతం, ముంగెన్నపాడు తదితర గ్రామాల్లోని వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి ఉన్నాయని ఆయా గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. కోవిలాం గ్రామానికి సమీపంలోని అలికాం-బత్తిలి రోడ్డు (ఏబీ)కు పక్క నుంచి ఉన్న పిన్నంనాయుడు చెరువు సాగునీటి కాలువకు గండి పడిందని స్థానిక రైతులు తెలిపారు. వర్షం నీరుతో పాటు సాగునీటి కాలువకు గండి కారణంగా వచ్చి చేరిన వరద నీటితో కోవిలాం, రావిచంద్రి గ్రామాలకు చెందిన పంట పొలాలు నీట మునిగాయని ఆయా గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు. గండి పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తురకపేట వద్ద నీట మునిగి ఉన్న పంట పొలాలు

తీర్థయాత్రలకు ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీ



ఆమదాలవలస: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను విశాఖపట్నం నుంచి ప్రారంభించినట్లు ఐఆర్‌సీటీసీ ఆర్ఎం డాక్టర్ క్రాంతి పి.సావర్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సంస్థ ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను ప్రకటించిందని పేర్కొన్నారు. 'ఆకర్షణీయమైన థాయిలాండ్' పర్యటన ఐదు రాత్రిళ్లు, ఆరు రోజులు ఉంటుందని తెలిపారు. ఈ పర్యటన సెప్టెంబర్ 7న బయల్దేరి 12వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఈ పర్యటనలో పట్టాయాలో నాంగ్ నూచ్ గార్డెన్, అల్కాజర్‌షో కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్ టూర్, డిన్నర్ తో రివర్ క్రూజ్, బ్యాంకాక్ లో గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాధా టైగర్ జూ వంటి ప్రదేశాలు సందర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రయాణానికి ఎయిర్ ప్యాకేజీ ధరలు ఒక వ్యక్తికి రూ.66,735 అని తెలిపారు. డబుల్ ఆక్యుపెన్సీ రూ. 57,815, ట్రిపుల్ ఆక్యుపెన్సి రూ.57,815 ఉంటుందని తెలిపారు.

ఈ ప్రయాణంలో విమాన టిక్కెట్లు విశాఖపట్నం - బ్యాంకాక్ - విశాఖపట్నం అలాగే మధ్యాహ్న భోజనంతో నాంగ్ నూచ్ తోటలో అల్కాజార్ షో ఉంటుందని తెలిపారు. లంచ్ తో పాటు స్పీడ్ బోట్ ద్వారా కోరల్ ఐలాండ్ పర్యటన సఫారీ వరల్డ్, మెరైన్ పార్క్‌తో పాటు లంచ్ కూడా ఉంటుందని వివరించారు. స్థానిక ఇంగ్లిష్ మాట్లాడే గైడ్ ఉంటారని, 80 ఏళ్ల వయసు వరకు ప్రయాణ బీమా కలదని తెలిపారు.

ఐదు రోజుల దక్షిణ దివ్య ఆలయ పర్యటన

'దక్షిణ దివ్య ఆలయ పర్యటన' ఐదు రాత్రిళ్లు, ఆరు రోజులు ఉంటుందని తెలిపారు. ఈ పర్యటన ఆగస్టు 14 నుంచి 19 వరకు ఉంటుందని తెలిపారు. ఈ పర్యటనలో మధురై మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరంలోని రామనాథ స్వామి దేవాలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని పద్మనాభ స్వామి ఆలయం వంటి ప్రదేశాలు సందర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రయాణానికి సింగిల్ ఆక్యుపెన్సి రూ.51, 400, డబుల్ ఆక్యూపెన్సీ రూ .39,880, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.38,005 ఉంటుందని తెలిపారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఎకానమీ క్లాస్ విమానం టికెట్, ఏసీ హోటల్ వసతి, ఐదు బ్రేక్ ఫాస్ట్‌లు, ఐదు డిన్నర్లు ప్రయాణ బీమా, టూర్ మేనేజర్ సేవలు ఉంటాయని తెలిపారు. నేరుగా టికెట్స్ బుక్ చేయాలనుకునే వారు ఐఆర్‌సీటీసీ, ప్రధాన ప్రవేశ ద్వారం, గేటు నెంబర్ - 1, రైల్వే స్టేషన్, విశాఖపట్నం-530004 ను సంప్రదించాలని తెలిపారు. ఎవరికి ఎలాంటి సమాచారం కావాల్సి ఉన్నా చందన్ కుమార్ 9281030748, సాయి ప్రసాద్ 9281495847, కేవీ రావు 9550166168 మొబైల్ నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

పిల్లలూ బాగున్నారా..

భవనానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం





నేను..
శ్రీరాజా శ్రీనివాస మెమోరియల్ జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలని.
ఫొటో చూశారుగా.. గుర్తు పట్టే ఉంటారులే.
ఎలా ఉన్నారంతా..? బాగానే ఉన్నారు కదా.
నేను కూడా బాగానే ఉన్నా..
కాకపోతే కాస్త వయసైంది కదా.. అందుకే పెంకులు పట్టు తప్పాయి.
మిగతా భవనాలన్నీ భేషుగ్గా ఉన్నాయిలే. అంతెత్తున కొత్త భవనాలు కూడా కట్టారు.
ఒకటా రెండా.. దాదాపు 125 ఏళ్ల వయసు నాది.
ఇన్నేళ్లలో నా ఒడిలో ఎంతో మంది చదువుకున్నారు.
ఇవే గదుల్లో అల్లరి చేశారు. ఇక్కడే బెత్తం దెబ్బలు తిన్నారు..
నా కళ్ల ముందే సర్టిఫికెట్లు తీసుకుని కంట నీరు పెడుతూ నన్ను వదిలి వెళ్లారు.
కానీ ఏమాటకు ఆ మాటే చెప్పుకోవాలి..
ఎక్కడకు వెళ్లినా.. నా పిల్లలు నన్ను మాత్రం మర్చిపోలేదు.
నాకు వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఊరూవాడా అదిరిపోయేలా పెద్ద ఫంక్షన్ పెట్టారు.
ఎంత ముచ్చటేసిందో నాకు..
ఇదిగో మళ్లీ ఇన్నాళ్లకు నా కోసం కష్టపడుతున్నారు.
ఏమీ లేదర్రా..
ఎప్పుడో రాజుల హయాంలో నాకు పెంకులు వేశారు.. ఇన్ని దశాబ్దాల్లో ఎన్నో తుఫాన్లు, గాలి వానలు చూశాను..
ఇప్పుడవి కాస్త పట్టు తప్పి పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.
వారు అలా ఇక్కట్లు పడడం నాకు కూడా కష్టంగానే ఉంది.
నా కష్టాన్ని ఎప్పుడు గుర్తించారో గానీ నా పిల్లలంతా ఏకమైపోయారు.
తలా కొంత వేసుకుని..
కన్నతల్లికి పట్టుచీర పెట్టినంత ప్రేమగా నాకు మళ్లీ పెంకులు వేయించి భవనాన్ని బాగు చేయిస్తున్నారు.
వారికి మీరు కూడా తోడవుతారని ఈ లేఖ రాస్తున్నాను.
నా ఒడిలో చదివి.. మళ్లీ ఇక్కడే మాస్టార్లుగా మారి పాఠాలు చెప్పిన వారిని చూశాను.
వారి పిల్లలు కూడా ఇక్కడే చదివి ఉన్నత స్థాయికి ఎదగడం కూడా గమనించాను.
మీరంతా ఏకమైతే..
మళ్లీ కొత్త ఊపిరి పోసుకుని రేపటి తరం కోసం సిద్ధమవుతాను.
నా పూర్వ విద్యార్థుల కష్టంలో పాలుపంచుకుంటారని ఆశిస్తూ..
మీ
ఎస్ఆర్ఎస్ఎం జెడ్పీ హైస్కూల్, మందస

– కాశీబుగ్గ

పాఠశాల భవనం పునర్నిర్మాణానికి సాయం చేయదలచుకున్న వారు 9989874748, 9849877932 నంబర్లను సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

కేన్సర్ రోగికి రూ.83 వేలు ఆర్థిక సాయం



కేన్సర్ రోగికి ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్‌లో నివాసముంటున్న హనుమంతు సింహాచలంకు పట్టణ కాళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 83 వేలు ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన సింహాచలం బ్లడ్ కేన్సర్‌తో బాధ పడుతున్నారు. విషయం తమకు తెలియడంతో వైద్య, కుటుంబ ఖర్చుల నిమిత్తం ఈ మొత్తం అందించినట్లు సంఘం అధ్యక్షుడు ఉప్పాడ పూర్ణారావు తెలిపారు. ఈ మొత్తాన్ని సంఘ సభ్యుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఆదివారం ఈ మొత్తాన్ని సింహాచలంకు అందించామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రోణంకి కృష్ణంనాయుడు, మార్పు విజయకుమార్, సింగూరు శ్రీనివాసరావు, బమ్మిడి శ్రీరామమూర్తి, సువ్వారి మురళీధర్, దానేటి గిరిదరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

నరసన్నపేట: విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని, గౌరవం లభిస్తుందని పౌరవిమానయాన మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సరస్వతీ దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ పొందిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ స్వామి దంపతులను సత్కరించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మేందర్ రెడ్డి

శ్రీకాకుళం, శ్రీకాకుళం న్యూ కాలనీ: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని రంగా రెసిడెన్సీలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ గత ఏడాది కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసిన ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగించాలన్నారు. కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందికి మూడు నెలల బాండ్ల విధానం రద్దు చేయాలన్నారు. గత ఏడాది కాంట్రాక్టు పీజీటీ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో జరిగిన అవకతవకలు సరిచేయాలన్నారు. బోధనేతర సిబ్బందిని ఆప్కాస్ పొరుగు సేవల సంస్థ నుంచి తప్పించి 2018 మునుపటి మాదిరిగా కాంట్రాక్టు పద్ధతిలో నియమకాలు చేపట్టాలని కోరారు. జిల్లా కార్యవర్గ సమావేశం పూజారి హరిప్రసన్న అధ్యక్షతనలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము అప్పలరాజు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రఘుస్వామి, జి.భాస్కరరావులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వేమార్గంలో భారీ వర్షాలు నేపథ్యంలో పలు రైళ్లు దారి మళ్లించారు. 18514 నంబర్ గల విశాఖపట్నం–కిరండోల్ ఎక్స్‌ప్రెస్, 18513 నంబర్ కిరండోల్–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు అరుకు మీదుగా వెళ్లేవి. వీటిని ముందస్తు జాగ్రత్తగా రాయగడ, విజయనగరంల మీదుగా ఈనెల 24 వరకు కొనసాగిస్తారు. రైళ్లు కిరండోల్ వరకు వెళ్లకుండా దంతేవాడ నుంచి రాకపోకలు సాగిస్తాయి. అదేవిధంగా 08551 నంబర్ గల విశాఖపట్నం–కిరండోల్ ప్యాసింజర్, 08552 నంబర్ గల కిరండోల్–విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లు దంతేవాడ వరకు రాకపోకలు సాగించనున్నాయి. ఈ మార్పులు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

విద్యా వారోత్సవాలకు సన్నద్ధం

- నేటి నుంచి వారం పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక వారోత్సవాలు
- 'శిక్షా సప్తాహ్' పేరిట కార్యక్రమాలు
- విజయవంతం చేయాలని డీఈఓ, ఏపీసీ పిలుపు

శ్రీకాకుళం న్యూకాలనీ, హిరమండలం:

ప్రభుత్వ బడుల్లో విద్యా వారోత్సవాల నిర్వహణకు విద్యాశాఖ నడుం బిగించింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)–2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 22 నుంచి 28వ తేదీవరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ (విద్యావారం) పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల శ్రీకాకుళం

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

మొదటి రోజు: ఈ నెల 22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన చేస్తారు. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహించాలి.

రెండో రోజు: 23న పునాది అభ్యాసన కార్యక్రమం ఉంటుంది. ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు చర్చ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది.

మూడోరోజు: 24న క్రీడా దినోత్సవం నిర్వహిస్తారు. పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్స్, పరుగుపందాలు తదితర వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించాలి.

నాల్గో రోజు: 25వ తేదీన సాంస్కృతిక దినోత్సవం. విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించేలా చేయడంతోపాటు విభిన్న నృత్య ప్రదర్శనలు, పాటలు, గేయాలాపన వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి.

ఐదో రోజు: 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవ. స్కిల్, డిజిటల్ ఇనీషియేటివ్‌లో భాగంగా ప్రస్తుత పోటీప్రపంచ యుగంలో లభిస్తున్న ఉద్యోగావకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆ నేపథ్యంలో తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలి.

ఆరో రోజు: 27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం. మిషన్ లైఫ్ యాక్టివిటీస్‌ను నిర్వహించాలి. పాఠశాలల్లో న్యూట్రిషన్ డే, పాఠశాలల్లో కొత్త ఏకో క్లబ్స్ ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పిల్లలతో చేపట్టాలి.

ఏడో రోజు: 28వ తేదీన సామాజిక భాగస్వామ్య దినోత్సవం. పాఠశాల అభివృద్ధిలో ప్రజలు, దాతలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం ప్రధాన ఉద్దేశం. ప్రముఖుల పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాల్లో భోజనాలు నిర్వహించడం, పాఠశాల విద్యార్థులతో కలిసి స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం చేయాలి.

విజయవంతం చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ పేరిట నిర్వహిస్తున్న వారోత్సవాలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను విధిగా నిర్వహించాలి. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

ఫొటో డాక్యుమెంటేషన్ నమోదు చేయాలి



విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాలకు సంబంధిత ఫొటోలతో కూడిన డాక్యుమెంటేషన్ విధిగా నమోదు చేయాలి. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వారం రోజుల పాటు ఈ కార్యక్రమాలను చేపట్టాలి. జిల్లాల్లోని ఉప విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లు, ఎంఈఓలు బాధ్యత తీసుకోవాలి.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ఏపీసీ, శ్రీకాకుళం

శ్రీకాకుళంలో రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం వేదికగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఏటా శ్రీకాకుళంతోపాటు వివిధ ప్రాంతాల్లో స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలను ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో పోటీల నిర్వహణ ఖరారైంది. జాతీయస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను శ్రీకాకుళం వేదికగా నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగం లేదా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా పోటీల నిర్వహనకు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు.

సెప్టెంబర్ 13 నుంచి 15వ వరకు

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం అన్నీ అనుకూలిస్తే జరిగితే సెప్టెంబర్ 13 నుంచి 15వ తేదీవరకు కొన్న చిన్నారావు మెమోరియల్ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ స్టేట్ మీట్‌లో అండర్– 14, 16, 18, 20 నాలుగు వయో విభాగాల్లో పోటీలు జరుగుతాయి. వివిధ అథ్లెటిక్స్ ఈవెంట్స్ రన్స్, త్రోస్, జంప్స్‌ను నిర్వహిస్తారు. ఈ మేరకు విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు), అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.గౌతమ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా నుంచి నొవడ విజయ్‌కుమార్, మెంటాడ సాంబమూర్తి, కె.హరిబాబు, బీవీ రమణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో పౌర్ణమి పూజలు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు



అర్చకుల నుంచి వేదాశీర్వచనాన్ని స్వీకరిస్తున్న సీవీఓ ప్రసన్నకుమార్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. విశేష, ప్రత్యేక దర్శనాలతో పాటు ఉచిత దర్శనానికి భక్తులు వెళ్లేలా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేశఖండన శాలలో తలనీలాల మొక్కులకు అదనంగా క్షురకులు డబ్బులు వసూలు చేసినట్లుగా ఆలయ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అన్నదాన ప్రసాదాన్ని సుమారు 500 మంది భక్తులు స్వీకరించారు. విరాళాలను కూడా సమర్పించా రు. ఇక ఒక్కరోజులో టిక్కెట్ల ద్వారా రూ.57,300, విరాళాల ద్వారా రూ. 73,813, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1.45 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో విద్యుత్ శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ విజిలెన్స్ అధికారి ఏవీఎల్ ప్రసన్నకుమార్ కుటుంబ సమేతంగా ఆదిత్యుడిని ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికార సిబ్బంది, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి వేదాశీర్వచన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

అమ్మకు అన్నంతో అలంకరణ



అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఆదివారం అన్నంతో అలంకరించారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారిని రెండు క్వింటాళ్ల అన్నంతో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు.

– సారవకోట

'రైతు సమస్యలపై సినిమా తీస్తున్నాం'



మాట్లాడుతున్న దర్శకుడు యార్లగడ్డ నందు

శ్రీకాకుళం అర్బన్: రైతు సమస్యలకు పరిష్కారం చూపుతూ అవినీతి రాజకీయ నాయకుల భరతం పట్టే కథతో నిర్మిస్తున్న 'హరహర ఓం' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించి గొప్ప విజయవంతం చేయాలని చిత్ర దర్శకుడు యార్లగడ్డ నందు అన్నారు. కుడోస్ క్రియేషన్స్ బ్యానర్‌పై యార్లగడ్డ నందు దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రానికి గార మండలం వమ్మరవల్లిలోని దానప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో ఆ గ్రామ సర్పంచ్ గంటా రఘునాథ రెడ్డి చేతులమీదుగా క్లాప్ కొట్టి తొలి ముహూర్తపు షాట్‌ను చిత్రీకరించారు. అనంతరం దర్శకుడు యార్లగడ్డ నందు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ ఈనెల 24వ తేదీ నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని తెలిపారు. చిత్ర నిర్మాత గంటా రామ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన విజయాల్లో ప్రతి సారి దానప్ప దేవుడు తోడు ఉన్నాడని, అలాగే ఈ హర హర ఓం సినిమాకు కూడా తోడు ఉంటాడని నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని ఇక్కడ చేస్తున్నామని తెలిపారు.

సెప్టెంబరు 1న విజయవాడలో సభ



ఏపీసీపీఎస్ఈఏ నూతన కార్యవర్గంతో సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: సెప్టెంబర్ 1న సీపీఎస్ బాధితులతో విజయవాడలో సభ ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, వ్యవస్థాపక సభ్యులు బి.బాలకృష్ణ తెలిపారు. ఏపీసీపీఎస్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం ప్రెస్ క్లబ్‌లో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, వ్యవస్థాపక సభ్యులు, గౌరవ సలహాదారులు బి.బాలకృష్ణల ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయడానికి ప్రభుత్వం సంవత్సరం సమయం అడిగిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ ఉద్యమం కొనసాగించడం జరుగుతుందన్నారు. అనంతరం ఏపీసీపీఎస్ వ్యవస్థాపక సభ్యులు జిల్లా కమిటీలో కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడిగా వడమశరత్, ప్రధాన కార్యదర్శి అంపోలు షణ్ముఖరావు, ఆర్థిక కార్యదర్శిగా బాడాన రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చల్ల సింహాచలం, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా పి.జయమ్మ, మహిళా ప్రధాన కార్యదర్శిగా దవళ లక్ష్మీ పార్వతి, అదనపు ప్రధాన కార్యదర్శిగా గేదెల రమేష్, రాష్ట్ర కౌన్సిలర్లుగా కరిమి రాజేశ్వరరావు, బొణిగి శ్యామ్, రానా ప్రతాప్, బుసకల ఈశ్వర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే శ్రీకాకుళం నగర అధ్యక్షులుగా ఓ.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పప్పల రామినాయుడు, ఆర్థిక కార్యదర్శిగా సువ్వారి సుభాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రానా ప్రతాప్, రాష్ట్ర గ్రామ సచివాలయం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని ఆదివారం విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ఎ.సురేష్ బాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఏకవార అభిషేకాలు, అర్చనలు చేయించి వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ చరిత్ర, శిల్ప సంపద అర్చకులు వివరించి పుణ్యాహవచనాలతో దీవించి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



దూసి వద్ద రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తి

కాశీబుగ్గ: పలాస జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సున్నాదేవి రైల్వేస్టేషన్‌కు సమీపంలో దిగువ లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించారు. ఆదివారం ఉదయం రైలు ఢీకొట్టి మరణించి ఉంటాడని రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు ఉన్నారని, తెల్లని ప్యాంట్, బ్లూకలర్ టీషర్టు వేసి ఉన్నారని ఆయన చేతిపై ఓంతో పాటు హిందీ అక్షరాల పచ్చబొట్లు ఉన్నాయని, ఆయన ఆధారాలు లభించడం లేదని జీఆర్పీ పోలీసులు తెలిపారు. అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు.


రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

పొందూరు: పొందూరు–జి.సిగడాం పరిధిలోని వాండ్రంగి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడని జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటాయని చెప్పారు. మృతుని వద్ద ఎలాంటి ఆనవాళ్లు, అడ్రస్‌కు సంబంధించి ఆధారాలు లభించలేదని చెప్పారు. సమాచారం ఉన్న వారు 9493474582 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దూసి సమీపంలో..

ఆమదాలవలస: దూసి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి సుమారు 55 ఏళ్లు ఉంటుందని, నీలం రంగు షర్టు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 94934 74582 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చిట్టిబాబుకు 'లలిత సంగీత సుధానిధి' బిరుదు ప్రదానం



బండారు చిట్టిబాబుకు గురు సత్కారం చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం కల్చరల్: వాడాడకు చెందిన తరుణీ కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఆదివారం లలిత గీతాల స్వరార్చన శ్రావ్యంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా కళాప్రవీణ బండారు చిట్టిబాబుకు గురు సత్కారం చేశారు. ఈ సందర్భంగా 'లలిత సంగీత సుధానిధి' బిరుదును అందజేశారు. ఈ సందర్భంగా బండారు చిట్టిబాబు స్వరపరిచిన గీతాలను వీనులవిందుగా ఆలపించారు. ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా చేపడుతున్న ధార్మిక, సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, మావుడూరు సత్యనారాయణ శర్మ, మండా వెంకట కామేశ్వరరావు, జామి భీమశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పాయిపురం గ్రామానికి చెందిన ఎం.గరికయ్య అనే వృద్ధుడు రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి నరసన్నపేట వైపు జి.రామారావు, టి.భుజంగరావు, కె.గణేష్ అనే ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ గరికయ్యను ఢీకొట్టారు. ప్రమాదంలో గరికయ్యతో పాటుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవేఅంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు అందించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

రోటరీ సేవలను మరింత విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌స్టలేషన్ అధికారి జి.విశ్వనాద్

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ క్లబ్ ఇన్‌స్టలేషన్ అధికారి జి.విశ్వనాద్ పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2024–2025 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందంజలో ఉండి అత్యుత్తమ క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. రోటరీ క్లబ్‌లో యువతను అధికంగా చేర్చాలన్నారు. తద్వారా క్లబ్ చేయబోయే ప్రాజెక్టులు, సేవా కార్యక్రమాలు మరింత త్వరితగతిన ముందుకు సాగుతాయన్నారు. క్లబ్‌లకు ఉండే స్థలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తగా చేరబోయే సభ్యులు క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రోటరీ క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీ దుర్గారావు, కె.నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి శ్రీకాకుళం క్లబ్‌ను ముందుకు తీసుకువెళతామన్నారు. స్వర్గధామం, ఆర్‌ఓ ప్లాంట్, పలు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని, వీటిని మరింత మెరుగ్గా తీసుకువెళతామన్నారు. ఈ ఏడాది రోటరీక్లబ్ ఆవరణలో వృద్ధ జనాశ్రమం చేపట్టేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు, దాతల సహకారంతో దీన్ని విజయవంతంగా నిర్మించనున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులుగా కేఎస్‌వీ దుర్గారావు, కింతలి నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎన్.నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా కోరాడ హరగోపాల్, జాయింట్ సెక్రటరీగా ఎస్.నాగేశ్వరరావు, పోలియో చైర్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, ఫౌండేషన్ చైర్ కోరాడ వైకుంఠరావు, మెంబర్‌షిప్ చైర్ ఎ.రఘురాం, పబ్లిక్ ఇమేజ్ చైర్ ఎం.నాగేశ్వరరావు, సర్వీస్ ప్రాజెక్టు చైర్ కేవీ కామేశ్వరరావు, ఒకేషనల్ చైర్ పి.వాసుదేవరావు, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ కెటి నాయుడు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కె.శోభారామకృష్ణ, కె.సుజాత తదితరులు ఎన్నికయ్యారు.

వృద్ధాశ్రమం నిర్మాణానికి విరాళాలు

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్మించేందుకు రోటరీక్లబ్ ప్రతినిధులు కింతలి నాగేశ్వరరావు రూ.లక్ష, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు రూ.లక్ష, కోరాడ వైకుంఠరావు దంపతులు రూ.లక్ష, మండా నాగేశ్వరరావు రూ.లక్ష, శోభా రామకృష్ణ రూ.లక్ష, నరసింహమూర్తి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అతిథి వి.రజనీకాంత్, అంధవరపు సంతోష్, అంధవరపు ప్రసాద్, ఎంఆర్‌కె దాస్, మామిడి క్రాంతి, పలువురు నగర ప్రముఖులు ఉన్నారు.

పచ్చిరొట్ట సాగుపై మక్కువ

- ఏటేటా పచ్చిరొట్టకు పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలో 1800 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా



కవిటి : జిల్లాలో పచ్చిరొట్ట సాగుపై మక్కువ పెరుగుతోంది. ఏటేటా రైతులు పచ్చిరొట్టపై ఆదరణ చూపిస్తున్నారు. నేలకు కావాల్సిన సేంద్రియ పదార్థాన్ని అందించడంలో పచ్చిరొట్ట వాడకం చవకైన పద్ధతి. పచ్చిరొట్ట ఎరువుల్లో జీలుగ, జనుము, అలసంద, పిల్లి పెసర, అవిసె ముఖ్యమైనవి. ఈ మొక్కల వేళ్ల బుడిపెల్లోని సూక్ష్మజీవుల ద్వారా నత్రజని స్థాపన జరుగుతుంది. నేలలో మిగిలిపోయిన మొక్కల భాగాల నుంచి నత్రజని తర్వాత వేర్లకు ఉపయోగపడుతుంది. అన్ని రకాల నేలల్లో వీటిని సాగు చేయవచ్చు. కానీ క్షారమృత్తిక నేలలు వీటికి అనువైనవి కావు. జీలుగును పెంచడం వల్ల చౌడు నెలలు బాగుపడి అధిక దిగుబడులు ఇస్తాయి. పువ్వుదశకు చేరుకున్న పచ్చి రొట్ట పైరును నేలలను కలియదున్నిన తర్వాత తగిన తగినంత మొత్తంలో నీరు పెట్టి మురగనివ్వాలి. భూమిలో కలియదున్నే సమయంలో ఎకరాకు 50 కిలోలు సూపర్‌ఫాస్పేట్ వేస్తే రొట్ట ఎక్కువ తయారవ్వడమే కాకుండా తొందరగా జీవికి పైరుకు కావాల్సిన ఫాస్పరస్ అందిస్తుంది.

రాయితీపై అందించాం..

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1800 క్వింటాళ్ల పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు సగం రాయితీపై అందించాం. ఏటా వీటిని వినియోగించే రైతుల సంఖ్య పెరుగుతుండడం మంచి పరిణామం. భూసార పరిరక్షణకు ఇది ఎంతో చక్కని సహజ వనరు. రైతులు దీనిపై అవగాహన చైతన్యం పెంపొందించుకోవాలి.

– డాక్టర్ కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం